




# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూన్ 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 231 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# వర్షాప్రభావంపై రైతులకు అవగాహన

## నీటి వినియోగం తక్కువున్న పంటలపై వివరణ

**పంటల మార్పిడి, వైవిధ్యంపై రైతులకు తెలియచేయాలి**

- దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునరుద్ధరణ
- అత్యవసర పనుల కోసం వేయికోట్ల నిధులతో పనులు
- వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో సిఎం సమీక్ష
- స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్1 :** వర్షా ప్రభావం, పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

# తెలంగాణ ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు



**హైదరాబాద్,జూన్1 :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, 'పరిపాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల కాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని కేసీఆర్ వివరించారు.

మిగతాద్ది 3 లో



# బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు సెక్షన్ చెల్లదన్న నాంపల్లి కోర్టు

**హైదరాబాద్,జూన్1 :** సింగరేణి కార్యాలయంపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో అరెస్టయిన బాల్క సుమన్ వ్యవహారంలో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. అతడిపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం సెక్షన్ వర్తించదని నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది.

3 లో




# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం
- అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్
- నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మహా సిఎంకు తెలంగాణ అంటే చిన్నచూపు
- తుమ్మిడిహట్టి గురించి లేఖ రాస్తే స్పందనేదీ
- జిల్లా పర్యటనలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సిఎం రేవంత్

3 లో



# కుటుంబంలో చిచ్చు పెట్టిన ఫోన్ ట్యాపింగ్

### బిఆర్ఎస్ నిర్వాకంపై మండిపడ్డ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్,జూన్1 :** గత బిఆర్ఎస్ హయాంలో తన ఫోన్ మాత్రమే కాకుండా తన తల్లి, భార్య ఫోన్ నంబర్లను కూడా ట్యాప్ చేసినట్లు ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించారు. సీఎల్పీ హాల్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# ఎకరా రూ.204 కోట్లు.. రాయదుర్గంలో 'భూ'మ్



**హైదరాబాద్:** రాయదుర్గంలో ఎకరా భూమి భారీ ధర పలికింది. టీజీఐఐసీ ఇక్కడి ప్లాట్ నంబర్-4కు వేలం నిర్వహించగా.. ఎకరా రూ.204 కోట్లు ధర పలికింది. ఈరోజు 5 ఎకరాలకు వేలం వేయగా.. రూ.వెయ్యి కోట్లకు పైగా ఆదాయం ఇచ్చింది. రెండు రోజుల క్రితం ఇక్కడ నిర్వహించిన వేలంలో ఎకరం రూ.237 కోట్లు ధర పలికింది. అప్పుడు రూ.1,490 కోట్లు ఆదాయం వచ్చింది. రెండు విడతల్లో కలిపి టీజీఐఐసీకి సుమారు రూ.2,500 కోట్ల ఆదాయం లభించింది.

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

- పేచీ కేవలం అక్కడి నాయకులతోనే
- ఇక్కడ వేలు పెడతా..

గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం

**పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక**



**హైదరాబాద్,జూన్1 :** ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు.

మిగతాద్ది 3 లో



3లో..

## తెలంగాణపై విషం చిమ్ముతున్న

# పవన్ కళ్యాణ్ విషం

- హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ ఏంటి ?
- తెలంగాణ దిష్టి తగిలిందని ఆనాడు అనలేదా
- బిజెపి ప్రోద్బలంతోనే పవన్ యాక్టింగ్
- మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట,జూన్1 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ 'నవనిర్మాణ సభ' పెడతాననడాన్ని ఆయన ఆక్షేపించారు. భాజపాతో ఒప్పందం మేరకే పవన్ నటన ప్రారంభించారని ఆరోపించారు. తెలంగాణను భాజపాకు తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవనిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దిష్టి తగిలి కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని పవన్ గతంలో అన్నారని.. ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు
- నేడు ఢిల్లీలో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ,జూన్1 :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

మిగతాది 3లో

# అన్నింటిపైనా సోషల్ మీడియా ప్రభావం

## - మహేశ్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్:** అన్నింటిపైనా సోషల్ మీడియా ప్రభావం చూపిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. సంకుచిత మనస్తత్వం వీడి.. విశాల దృక్పథంతో పని చేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర, దేశ రాజకీయాలపై యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. "మంచి విషయ పరిజ్ఞానం ఉండి.. బాగా మాట్లాడేవారిని ప్రోత్సహించాలని రాహుల్ గాంధీ చెప్పారు. ఆయనకు స్వార్థం ఉంటే 2004, లేదా 2009లో ప్రధాని అయ్యుండేవారు. పదవుల కంటే దేశం ముఖ్యమని ఆయన భావించారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# తెలంగాణలో బిజెపికి అధికారం కల్ల

- మతం పేరుతో రాజకీయాలు తగవు
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని విమర్శలు



**హైదరాబాద్,జూన్1 :** మతపరమైన విభజన పైన.. మతం అనే సౌధంపైన భాజపా నిలబడి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ముగ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. భాజపా తెలంగాణాలో దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందని ఆ పార్టీ నేతలు ఊదరగొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో భాజపా కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజల అసంతృప్తిని చూస్తున్నాం. అందుకే, సీపీఐ శ్రేణులు పోరాటాలు చేయాలి. సమస్య ఎక్కడ ఉంటే.. అక్కడ మనం ఉండాల్సిందే. వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటే కనీసం ఐదు స్థానాల్లో, లేకుంటే కనీసం 15 స్థానాల్లో పోటీ చేసేలా సన్నద్ధం కావాలి.

మిగతాది 3లో

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు.

టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

## తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్ కళ్యాణ్ విషం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఏర్పడిన తర్వాత 11 రోజులు అన్నం మానేశానని పవన్ చెప్పారని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో మాట్లాడారని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, తెలంగాణ ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజున హైదరాబాద్‌లో నవనిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కళ్యాణ్‌కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. 'తెలంగాణ కళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని చెప్పిన పవన్ కళ్యాణ్, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి' అని వ్యాఖ్యానించారు. అలాగే నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కళ్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

## వర్షాప్రభావం,పై రైతులకు అవగాహన

మొదటి పేజీ తరువాయి

ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం
## తెలంగాణ ప్రజలకు కెసిఆర్ శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి

సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య వైద్యం తదితర సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందనీ కేసీఆర్ తెలిపారు. ఒకప్పుడు ఎడారిలా మారిన తెలంగాణను.. నేడు కోటి ఎకరాల మాగాణంగా మార్చి, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత నాటి పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని కేసీఆర్ ఘంటాపథంగా చెప్పారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తుల నుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలనీ కోరిన ఆయన.. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలనీ సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. ల్ల÷తాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు, సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం
## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు

**ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు.

బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఆంక్షలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండటంతో.. ప్రయాణికులు ఆ రూట్లలో మెట్రో ప్రయాణం ఎంచుకోవడం మేలని పోలీసులు సూచించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే వారు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాటర్ బాటిల్ క్యారీ చేయాలని సలహా ఇచ్చారు.

## బార్‌లో యువకుల మధ్య గొడవ
## యువతని కారుతో ఢీకొని చంపిన దుండగులు

ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోష్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ధి చెప్పి బయటకు పంపించారు. ఃార్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు. అయితే యాన్సీ స్నేహితులు కారుపై రాళ్లు విసరడంతోనే ..వారు ఢీకొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన యాన్సీ అక్కడికక్కడే మృతి చెందంగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. నిందితులను కఠిన శిక్ష విధించాలని మృతురాలి కుటుంబం కోరింది. 18 ఏళ్లలోపు వారిని బార్‌లోకి అనుమతించినందుకు అధికారులు ఆ ప్రైవేట్ బార్‌ను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు.

## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు
## కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల

సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్ , జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత దిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

## నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం
## ఒకేరోజు ముగ్గురు మహిళల మెడగొలుసులు చోరీ

నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు ముగ్గురు మహిళల మెడల్లో బంగారు గొలుసులను అపహరించడం తీవ్ర కలకలం రేపింది. జేమ్స్ గార్డెన్, పడరుపల్లి, చిల్డన్స్ర పార్క్ ప్రాంతాల్లో దుండగులు బరితెగించారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు సాగాయి. మొత్తం 9 సవర్ల బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నవాబుపేట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి.

వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## కుటుంబంలో చిచ్చు పెట్టిన ఫోన్ ట్యాపింగ్

మొదటి పేజీ తరువాయి

'మీ భర్తతో మాట్లాడే విషయాలను వేరే వాళ్లు వింటే మీకు ఎలా ఉంటుంది?' అంటూ ఆయన ప్రశ్నించారు. తన తల్లి పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని పేర్కొన్న ఆయన.. కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం బాధాకరమని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తమ కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు. 'ఇంటికి వెళ్తే మా భార్య నన్ను తిడుతోంది. నీ వల్ల నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని నా భార్య అడిగితే ఏం చెప్పలేకపోతున్నా' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లోకి రావడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. 'బిజినెస్ చేసుకుంటూ ఉంటే బాగుండేది. రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని ఇప్పుడు ఆలోచిస్తున్నా' అని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బాధ్యులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా చర్యలు చేపడతారనే నమ్మకం ఉందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు.

## ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మొదటి పేజీ తరువాయి

వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## తెలంగాణలో బిజెపికి అధికారం కల్ల

మొదటి పేజీ తరువాయి

ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు వేధింపులపై 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)పై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. ఆగస్టు 6 నుంచి 15 వరకు పాదయాత్రలు చేపట్టాలి. రాష్ట్రంలో బలమైన 40 నియోజకవర్గాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో పాదయాత్రలు చేపట్టాలి. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర.. రాష్ట్ర వైఫల్యాలు ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక సమస్యలను పాదయాత్రల్లో ప్రస్తావించాలి. సెప్టెంబర్ 28వ తేదీన చలో దిల్లీ కార్యక్రమం ఉంటుంది' అన్ని అన్నారు.

## బాల్కపై ఆస్తుల విధ్వంసం కేసు
## సెక్షన్ చెల్లదన్న నాంపల్లి కోర్టు

మొదటి పేజీ తరువాయి

బాల్క సుమన్‌పై కేసులో 2 సెక్షన్లు మాత్రమే వర్తిస్తాయని కోర్టు వెల్లడించింది. అతడిపై నమోదు చేసిన మిగిలిన సెక్షన్లను నాంపల్లి కోర్టు తొలగించింది. బాల్క సుమన్‌పై నమోదైన కేసు నేపథ్యంలో సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. సుమన్ రిమాండ్ రిజక్ట్ కోరుతూ మెమోను దాఖలు చేశారు. మే 26వ తేదీన తెలంగాణ భవన్‌లో టీబీజీకేఎస్ సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడుతూ.. నాంపల్లిలోని సింగరేణి భవన్‌తోపాటు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సింగరేణి భవన్ అధికారులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

# కరెన్సీ నోట్లతో చరిత్రను చెక్కుతున్న "కరెంట్ ప్రసాద్"

▪ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి అరుదైన కరెన్సీ మెమెంటో.. ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్న మహబూబ్‌నగర్ విద్యుత్ శాఖ ఉద్యోగి

**కరపత్రం ప్రతినిధి, , మహబూబ్‌నగర్ జూన్ 1**
అభిరుచి, అంకితభావం, సృజనాత్మకత కలిస్తే సాధారణ వ్యక్తి కూడా అసాధారణ గుర్తింపు పొందగలడని నిరూపిస్తున్నారు మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి, అరుదైన కరెన్సీ నోట్ల సేకరణకర్త డి.ఆర్.వి. ప్రసాద్. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో "కరెంట్ ప్రసాద్"గా ప్రసిద్ధి చెందిన ఆయన, భారతీయ కరెన్సీ నోట్లను వినూత్నంగా వినియోగిస్తూ చారిత్రక, రాజకీయ, సామాజిక అంశాలను ప్రతిబింబించే మెమెంటోలు రూపొందించి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు.
సాధారణంగా ప్రజలు కరెన్సీ నోట్లను లావాదేవీల కోసం మాత్రమే ఉపయోగిస్తారు. అయితే ప్రసాద్ వాటిలోని తేదీలు, సీరియల్ నంబర్లు, ప్రత్యేక గుర్తులను గుర్తించి వాటిని చారిత్రక సంఘటనలు, ప్రముఖుల జన్మదినాలు, జాతీయ వేడుకలకు అనుసంధానం చేస్తూ అరుదైన కళాఖండాలుగా మలుస్తున్నారు. ఈ ప్రత్యేకతే ఆయనను ఇతర కలెక్షనర్ల నుండి ప్రత్యేకంగా నిలబెడుతోంది.

పుట్టినరోజు తేదీలతో మెమెంటోలు
భారతదేశ రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖుల జన్మదినాలను ప్రతిబింబించేలా ఒక్క రూపాయి నుంచి రూ.500 వరకు వివిధ విలువల కరెన్సీ నోట్లను సేకరించడం ఆయన ప్రత్యేకత. ఆయా నోట్లపై కనిపించే తేదీలు, సంఖ్యలను అనుసంధానం చేస్తూ వాటిని అందమైన మెమెంటోలుగా రూపొందిస్తారు.
ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ , మాజీ ముఖ్యమంత్రి కే . చంద్రశేఖర్ రావు , మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ తదితర ప్రముఖుల జన్మదినాలను ప్రతిబింబించే కరెన్సీ మెమెంటోలను రూపొందించి వారి అభిమానులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకున్నారు.
ప్రతి మెమెంటోలో కేవలం కరెన్సీ నోట్లు మాత్రమే కాకుండా, ఆ వ్యక్తి జీవిత విశేషాలు, ప్రజాసేవ, సాధించిన విజయాలు, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా స్వయంగా రచించిన కవితా పంక్తులు, వివరణాత్మక అంశాలు, చిత్రపటాలను కూడా చేర్చడం ఆయన ప్రత్యేకత. దీంతో ప్రతి మెమెంటో ఒక చారిత్రక పత్రంలా రూపుదిద్దుకుంటుంది.
తెలంగాణ ఉద్యమ త్యాగాలను స్మరించే అరుదైన సృష్టి




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డి.ఆర్.వి. ప్రసాద్ రూపొందించిన ప్రత్యేక మెమెంటో ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన చారిత్రక ఘట్టాన్ని ప్రతిబింబించేలా "02-06-2014" తేదీ కనిపించే కరెన్సీ నోట్లను సేకరించి ఈ కళాఖండాన్ని రూపొందించారు.
ఈ మెమెంటోలో 1969 తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు తమ ప్రాణాలను అర్పించిన త్యాగమూర్తులను స్మరించడమే కాకుండా, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల కృషిని ప్రతిబింబించే అంశాలను పొందుపరిచారు. తెలంగాణ కోసం జరిగిన దశాబ్దాల పోరాట గాథను ఒకే ఫ్రేమ్‌లో చూపించే ప్రయత్నం చేశారు.
సేకరణ వెనుక అపారమైన శ్రమ
ఒక ప్రత్యేక తేదీ కలిగిన కరెన్సీ నోటును గుర్తించడం అంత సులభం కాదు. బ్యాంకులు, ప్రజలు, స్నేహితులు, పరిచయస్తుల ద్వారా వేలాది నోట్లను పరిశీలించి, కావాల్సిన తేదీ లేదా సంఖ్యలతో కూడిన నోట్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒకే తేదీకి సరిపడే నోట్ల కోసం నెలల తరబడి వెతకాల్సి వస్తుందని ప్రసాద్ చెబుతున్నారు.
ఈ అభిరుచిని కేవలం హాబీగా కాకుండా, చరిత్రను భావితరాలకు చేరవేసే సాధనంగా భావిస్తూ ఆయన నిరంతరం కొత్త సేకరణలను కొనసాగిస్తున్నారు.
ప్రముఖుల ప్రశంసలు
ప్రసాద్ రూపొందించిన అనేక మెమెంటోలు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సాహితీవేత్తలు, కళాకారుల ప్రశంసలను పొందాయి. కరెన్సీ నోట్ల ద్వారా చరిత్రను, వ్యక్తుల సేవలను, జాతీయ భావనను ప్రజలకు చేరవేయాలనే ఆయన ఆలోచనకు పలువురు అభినందనలు తెలిపారు.
మరిన్ని అరుదైన సేకరణలే లక్ష్యం
భవిష్యత్తులో భారత స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారులు, జాతీయ నాయకులు, సామాజిక సంస్కర్తలు, శాస్త్రవేత్తలకు సంబంధించిన మరిన్ని అరుదైన కరెన్సీ మెమెంటోలను రూపొందించాలని డి.ఆర్.వి. ప్రసాద్ సంకల్పించారు. తన సేకరణను మరింత విస్తరించి యువతలో చరిత్రపై ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.
కరెన్సీ నోట్లను కేవలం ధనానికి ప్రతీకగా కాకుండా చరిత్ర, సంస్కృతి, వ్యక్తిత్వాల ప్రతిబింబాలుగా మలుస్తూ మహబూబ్‌నగర్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్న "కరెంట్ ప్రసాద్" ప్రతిభకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఆయన రూపొందించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ప్రత్యేక మెమెంటో రాష్ట్ర చరిత్రను స్మరింపజేసే అరుదైన కళాఖండంగా నిలిచింది.

## భీమదేవరపల్లి లో బెల్ట్ షాపుల నిషేధం, నిర్వహిస్తే పదివేల జరిమాన, గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం

**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి;**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలో బెల్ట్ షాపులు నిషేధిస్తున్నట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే పదివేల జరిమానా వేయనున్నట్లు పాలకవర్గం నిర్ణయించారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా తక్షణమే అమలు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ శనిగరపు ఐలయ్య, కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాసరెడ్డి, అశోక్, వెంకటేశ్వర్లు, శ్యాము, విజయ, సంధ్య లు తెలిపారు.


గ్రామ పంచాయతీ కార్యాలయము

## ఆర్గానిక్ ఫామ్ అగ్నిప్రమాద బాధిత రైతుకు అండగా మున్సిపల్ చైర్మన్

▪ బొల్ల వేణు ఫామ్‌ను పరిశీలించి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ

**కరపత్రం ప్రతినిధి, , జమ్మికుంట జూన్ 1**
జమ్మికుంట పట్టణ పరిధిలోని 13వ వార్డుకు చెందిన యువ రైతు బొల్ల వేణు నిర్వహిస్తున్న రెండు ఎకరాల ఆర్గానిక్ ఫామ్‌లో సంభవించిన అగ్నిప్రమాద ఘటనపై మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్పందించారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఘటన స్థలానికి చేరుకుని దగ్ధమైన పంట, పశువుల మేత నిల్వలు మరియు పరిసర ప్రాంతాలను పరిశీలించారు.
ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, సుమారు 25 పాలిచ్చే గేదెలకు సంబంధించిన మేత పంట పూర్తిగా



అగ్నికి ఆహుతి కావడంతో రైతుకు రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే స్థానిక తహసీల్దార్ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారని పేర్కొన్నారు.
బాధిత రైతు వేణుకు న్యాయం జరిగేలా స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌లతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్న యువ రైతుకు ఈ నష్టం తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధులు మరియు అధికారులు అండగా నిలవడం తమ బాధ్యత అని అన్నారు.
అలాగే రైతులకు సూచనలు చేస్తూ, పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన అవశేషాలను నిర్లక్ష్యంగా తగులబెట్టడం వల్ల అగ్ని ఇతర పొలాలకు వ్యాపించి భారీ నష్టాలు కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అగ్నిప్రమాదాల నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.
బాధిత రైతును పరామర్శించిన వారిలో ఎగిత అశోక్, మైస రవి, అనిల్, శ్రీకాంత్, పొడేటి అనిల్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి..



### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని జూన్ 01:**
గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ఎండోమెంట్స్ శాఖ నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖకు కొంత నిధులు కేటాయించినందున అవసరమైన పనులను గుర్తించి, వాటి అంచనాలు, ప్రతిపాదనలను రూపొందించి సంబంధిత ఆమోదాల కోసం వీలైనంత త్వరగా సమర్పించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారులు, ఘాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం తదితర అంశాలకు సంబంధించిన పనులను ముందస్తుగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, ఎండోమెంట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రియ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతుల రాకపోకలకు ఆటంకం కలగొద్దు

▪ కొత్తపల్లి సబ్‌స్టేషన్--రామన్నపల్లి రహదారి వివాదంపై స్థల పరిశీలన చేసిన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి, , జమ్మికుంట జూన్ 1**
జమ్మికుంట పట్టణ పరిధిలోని ధర్మారం శివారులో ఉన్న కొత్తపల్లి సబ్‌స్టేషన్ నుంచి రామన్నపల్లి రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఉపయోగిస్తున్న రహదారిపై తలెత్తిన వివాదం నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్థానిక తహసీల్దార్‌తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు.
రైతులు వినియోగిస్తున్న మార్గం వద్ద ఎన్‌పీడీసీఎల్ అధికారులు గోడ నిర్మాణం చేపడుతున్నారని సమాచారం అందడంతో వెంటనే స్పందించిన చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి స్థల పరిస్థితులను పరిశీలించి రైతుల అభ్యంతరాలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా రైతులు, తాము ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయ పనుల నిమిత్తం ఈ రహదారినే వినియోగిస్తున్నామని, గోడ నిర్మాణం వల్ల తమ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని



వివరించారు.
మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, రహదారి యాజమాన్యంపై స్పష్టత కోసం రెవెన్యూ మరియు ఎన్‌పీడీసీఎల్ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. రైతులకు సంబంధించిన రహదారి అయితే ఎన్‌పీడీసీఎల్ అధికారులు గోడ నిర్మాణాన్ని వెనక్కి తీసుకోవాలని, ఒకవేళ ఆ స్థలం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోకి వస్తే రైతులకు ప్రత్యామ్నాయ మార్గం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.
రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమస్యను



త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రామన్నపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల రాకపోకలకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వి.వో.ఏ.ల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా, జూన్ 1 / కరపత్రం ప్రతినిధి, .**
మహేశ్వరం మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకేపీ) పరిధిలో పనిచేస్తున్న వి.వో.ఏ.లు తమ డిమాండ్ల సాధన కోసం గత 15 రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధర్నా శిబిరాన్ని సందర్శించి వి. వో. ఏ.ల ఆందోళనకు మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వి. వో. ఏ.లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వి.వో.ఏ లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీని అమలు చేయడంతో పాటు నెలకు రూ.20,000 గౌరవ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.
వి.వో.ఏ.లు గ్రామీణాభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో కీలక



పాత్ర పోషిస్తున్నారని పేర్కొంటూ, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సబితా ఇంద్రారెడ్డి అన్నారు.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం పి.ఏ.సి.ఎస్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు రాజు, మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, బి.ఆర్.ఎస్.సీనియర్ నాయకులు కరోళ్ల చంద్రయ్య, పోతర్ల అంబయ్య యాదవ్, స్వర్ణగంటి ఆనందం, ఉప సర్పంచ్ జోరల్ల రమేష్, మాజీ ఎస్సీ-ఎస్టీ కమిషన్ చైర్మన్ చిలకమ్రి



నరసింహ, సమీర్, పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్లు కాడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఆదిల్ అలీ, సుధాకర్ రెడ్డి, కటికల మహేందర్, ఆజం, ఆకుల వీరబాబు, రేవెల్ల చంద్రమౌళి, సున్నం కృష్ణ, ఆవులకాడి శ్రీశైలం, దుద్ద కృష్ణ యాదవ్, మిద్దింటి సురేష్, తెల్జిరి శ్రీశైలం, కటికల పరమేష్, మోతి కృష్ణ, కటికల శంకర్, కట్నం బీరప్ప, తింగిరికారి నరేష్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

▪ గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం -- డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు





**కరపత్రం ప్రతినిధి, , జమ్మికుంట జూన్ 1**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసులు విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం కలిసి రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సామాన్లు, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే మార్గాల ద్వారా గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో స్టేషన్ పరిసర ప్రాంతాలను సైతం జల్లెడ పట్టారు.
ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు.ప్రజల భాగస్వామ్యంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్న అధికారులు, సమాజాన్ని మత్తు పదార్థాల బారినుంచి కాపాడేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా నిఘా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
పోలీసుల ఈ ప్రత్యేక తనిఖీలు ప్రయాణికుల్లో భద్రతా భావనను పెంపొందించడంతో పాటు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలకు సంకేతంగా నిలిచాయి.

# ఓటర్ వెరిఫికేషన్ (ఎస్ ఐ ఆర్ )పై కాంగ్రెస్, బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి: ఆకుల రాజేందర్

▪ డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకే ప్రత్యేక పరిశీలన ప్రక్రియ -- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి



**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట జూన్ 1**
ఓటర్ వెరిఫికేషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లపై ఉన్న ఓట్లు, ఒకే వ్యక్తికి వివిధ జిల్లాల్లో నమోదైన ఓట్ల వంటి అక్రమాలను సరిదిద్దడానికే ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియను చేపడుతోందని పేర్కొన్నారు.
ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ఇప్పటివరకు 11 సార్లు ప్రత్యేక ఓటరు జాబితా పరిశీలన (ఎస్ ఐ ఆర్ ) నిర్వహించబడిందని, ప్రస్తుతం జరుగుతున్నది 12వసారి మాత్రమేనని తెలిపారు. ఇది కొత్తగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమం కాదని, పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగబద్ధంగా నిర్వహించే ప్రక్రియ అని స్పష్టం చేశారు.
ఓటరు జాబితాల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అవసరమని పేర్కొన్న ఆయన, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 50 నుంచి 100 వరకు డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లు ఉన్న ఓట్లు కనిపిస్తున్నాయని ఆరోపించారు. అలాంటి అక్రమాలను తొలగించడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు.
2012 ఓటరు జాబితా ఆధారంగా మ్యాపింగ్ విధానంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ భాగస్వాములవుతున్నారని, అవసరమైతే తమ ఓట్లలో కూడా సవరణలు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.
అయితే క్షేత్రస్థాయిలో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాకపోయినా, పైస్థాయి నాయకత్వం మాత్రమే ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తోందని ఆకుల రాజేందర్ ఆరోపించారు. ఓటరు జాబితాల ప్రక్షాళన ద్వారా గతంలో జరిగిన అవకతవకలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అనవసర వివాదాలకు తెరలేపుతున్నాయని విమర్శించారు.
అలాగే బీజేపీ కార్యకర్తలు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు మరియు సవరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

# ఉత్తరాఖండ్ లో జరిగే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశానికి కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ కు ఆహ్వానం.



**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 1**
ఈనెల 3, 4 తేదీలలో జరగనున్న సమావేశాలు.ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం మేరకు సమావేశాల్లో పాల్గొననున్న మేయర్ కోలగని శ్రీనివాస్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశాల్లో గౌరవ అతిథిగా పాల్గొనాల్సిందిగా కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ కు ఋషికేష్ నగరపాలక సంస్థ ఆహ్వానం పలికింది. ఈ మేరకు సోమవారం రోజున ఋషికేష్ నగరపాలక సంస్థ నుండి మేయర్ కోలగని శ్రీనివాస్ కు ఆహ్వాన పత్రికను పంపించారు. జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఉత్తరాఖండ్ ముఖ్య మంత్రి పుష్కర్ సింగ్ ధామి తో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు, రాజ్యసభ, లోక్ సభ సభ్యులు హాజరుకాన్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి , ఆహ్వాన కర్త మనోజ్ గుప్తా, సహా ఆహ్వాన కర్త , ఋషి కేష్ నగరపాలక సంస్థ మేయర్ రణజాయ్ పాన్వర్ ల ఆహ్వానం మేరకు మేయర్ కోలగని శ్రీనివాస్ సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రధానంగాఈ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల మేయర్లు పాల్గొని పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి.

## - జిల్లా కలెక్టర్ కు టీయూడబ్ల్యూజే-ఐజేయు వినతి



**కరపత్రం ప్రతినిది, గోదావరిఖని జూన్ 01:**
జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే -ఐజేయు పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షులు మల్లావర్జుల వంశీ విద్యానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ కలెక్టర్‌తో మాట్లాడుతూ పెద్ద, మధ్య, చిన్న తరగతి పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మండల రిపోర్టర్లందరికీ సీఎ సర్టిఫికెట్ తో ఎటువంటి సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పోలీస్ కమిషనరేట్, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్ వంటి ప్రతిష్టాత్మక రంగాలు ఉండటంతో పాటు మూడు మండలాలు విస్తరించి ఉన్నాయని ఈ నేపథ్యంలో అక్కడ ప్రధాన పత్రికలకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న 9 మంది ప్రతినిధులకూ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం ఎంతో అవసరమని కలెక్టర్ కు వివరించారు. మొదటి విడతలో కమిటీ ఆమోదించినప్పటికీ కొందరు నిజమైన వర్కింగ్ జర్నలిస్టులను పక్కన పెట్టారని, వారి వివరాలపై మరొకసారి క్షుణ్ణంగా పరిశీలన జరిపి కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రింట్ అయ్యి వివిధ కారణాలతో హోల్డ్‌లో పెట్టిన అక్రిడేషన్ కార్డులను సైతం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రింట్ మీడియాలో నియోజకవర్గ స్థాయి కార్డులను తొలగించడం వల్ల రిపోర్టర్లంతా ప్రస్తుతం మండల స్థాయి కార్డులు పొందాల్సి వస్తోందని, వారందరికీ ప్రయాణ ఇబ్బందులు కలగకుండా స్టేట్ బస్ పాస్ లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కలెక్టర్ ను కోరారు. సంఘం నాయకుల విజ్ఞప్తిపై కలెక్టర్ కోయ శ్రీహర్ష సానుకూలంగా స్పందించారు. వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు టి.కె.శ్రీనివాస్, సామల హరికృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరమల్ల విద్యాసాగర్ రావు, ఆకుల రమేష్, జిల్లా నాయకులు తగరం రాజు, ముత్యాల నర్సయ్య, కొమురవెల్లి భాస్కర్, గాదె బాలయ్య, మృత్యుంజయ, కొండ లింగమూర్తి, తిరుమల సురేష్, ముఖేష్, జైపాల్, మోదుంపల్లి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# సైకిల్ ర్యాలీలో అందరం పాల్గొందాం - కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ బాధ్యులు



**కరపత్రం ప్రతినిది కరీంనగర్ జూన్ 1**
03 జూన్ 2026 రోజు ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ , ఏ. జె. పెడల్స్ సంయుక్తంగా నిర్వహించే సైక్లింగ్ ర్యాలీలో ఔత్సాహిక సైక్లిస్టులు, సైక్లింగ్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు , ఇతర బాధ్యులు విజ్ఞప్తిచేశారు.
నగరంలోని వామిలాలపల్లి లో గల అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతూ 03 జూన్ రోజున ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి ఎలగందల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొని పూర్తి చేసిన సైక్లిస్టులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అన్ని వయస్సుల వారు ఈ ర్యాలీలో తమ సైకిల్‌లతో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు నిత్యం విధిగా సైక్లింగ్ చేయడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ సంక్షోభాల వల్ల చమురు కొరత ఏర్పడడం, చమురు ధరలు పెరగడం వంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తాయని, దీనికి విరుగుడుగా శిలాజ ఇంధన వాహనాల వినియోగాన్ని తగ్గిస్తూ, సైక్లింగ్‌ను ప్రతి ఒక్కరు తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తి గలవారు 03 జూన్ రోజు ఉదయం 5:30 గంటలకు తెలంగాణ చౌరస్తా వద్ద సైకిళ్ళతో హాజరు కావాలని కోరారు. ఈ గోడ ప్రతి ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, కోశాధికారి వి.జగదీశ్వరా చారి, కార్యవర్గ సభ్యులు అఖిల్ రెడ్డి, డా: వడ్లూరి శ్రీనివాస్, ఎం మహెందర్ ఉ తదితరులు పాల్గొన్నారు.
మరిన్ని వివరాలకు 9032762247 & 9398230614 నందు సంప్రదించగలరని తెలిపారు

# లాడ్జీలు,రెస్టారెంట్లు, వైన్ షాపులు, బస్టాండ్ పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు

– గంజాయి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక డ్రైవ్



**కరపత్రం ప్రతినిది, గోదావరిఖని జూన్ 01:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గోదావరిఖని-1 టౌన్ పోలీసులు,పోలీస్ యాంటీ నార్కోటిక్స్ వింగ్, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సంయుక్త ఆధ్వర్యంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని బస్టాండ్, పాన్ షాపులు, స్మోకింగ్ జోన్లు, వైన్ షాపులు, రెస్టారెంట్లు, లాడ్జీలు, ఐబీ కాలనీ పరిసరాలు, ఆటో స్టాండ్లు, టీ స్టాళ్లు తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికుల సామగ్రి, అనుమానాస్పద ప్రాంతాలు, అలాగే ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరిఖని-1 టౌన్ ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



**కరపత్రం ప్రతినిది, మంథని జూన్ 1**
మంథని ఆర్టిసి బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లి సత్తయ్య సహకారంతో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షుడు ఎగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్ట మధన్న బస్టాండులో పిల్ల తల్లులు తమపిల్లకు పాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా ఒక చిన్న రూము ను చాలా సంవత్సరాల క్రితమే ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పుడు ఇప్పుడు దానిముందు మజ్జిగ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్ లాల్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేపల్లి కుమార్,మాజీ కౌన్సిలర్ కాయితీ సమ్మయ్య,నాయకులు కనవేన శ్రీనివాస్, పుప్పాల తిరుపతి, అంబటి నర్సింగ్, పోలు కనకరాజు,౦ఎ జావిద్ తదితరులు పాల్గొన్నారు.